**ఈ వారం కథ**

# సంఘటన


-సూరేపల్లి విజయ

**కొన్ని సంఘటనలు జీవనగతిని మారుస్తాయి. మరికొన్ని సంఘటనలు జీవితాన్ని ఏమారుస్తాయి. ఇంకొన్ని సంఘటనలు జీవితాన్ని ప్రభావితం చేస్తాయి.**

**సంఘటన గొప్పదే... మంచివైపు మరల్చేదైతే...**

★ ★ ★

అతను నడుస్తున్నాడు. అలా అనడం కంటే ఓ జీవచ్ఛవం కదులుతోంది అనడం సమంజసంగా ఉంటుంది. అతని మొహంలో నీరసం తప్ప నవరసాల్లో ఏ రసమూ తొణికిస లాడ్డంలేదు. ఆకలి అనే పదం గూర్చి కూడా మర్చిపోయి చాలా రోజులైనట్టుంది. మొహమంతా మన దేశ ఆర్థిక పరిస్థితిలా పీక్కుపోయి ఉంది. శరీరంలో ఏ భాగమూ అతనికి సహకరిస్తున్నట్టు లేదు. భారంగా అడుగులేస్తున్నాడు.



అతని కళ్ళ ముందు నిర్మానుష్యమైన రోడ్డు కనిపించలేదు. నిర్మానుష్యంగా మారిన తన జీవితం కనిపిస్తోంది.

ఆకాశానికి... భూమికి మధ్య చీకటి పరదా వేలాడుతోంది. దూరంగా క్లాక్‌టవర్ పన్నెండు గంటలను వినిపించింది. అర్ధరాత్రి అతని ఆలోచల్లానే, ప్రపంచమూ నిద్రాణస్థితిలో ఉంది.

పదేళ్ళ క్రితం విశ్వ విజ్ఞానాన్ని, తన స్వంతం చేసుకొని, వందలాది మేధావుల ముందు పట్టా అందుకున్న పోస్టుగ్రాడ్యుయేట్ అని ఎవరూ గుర్తించలేరు.

పేదరికం అతని రూపురేఖలను మార్చేస్తే, ఆకలి అతడ్ని క్షణం క్షణం అణువణువు దహించి వేసి, నిస్సహాయుడిగా, నిర్వీర్యుడిగా మార్చింది. ఆకలి కన్నా భయంకరమైనది మరొకటి ఉందా?

అతని కనుల ముందు ఒకే సంఘటన సాక్షాత్కరిస్తోంది.

★ ★ ★

స్కూలుకెళ్ళే వయసులో స్కూలుకి వెళ్ళనని మారాం చేస్తుంటే, 'బడికి వెళ్ళక నాలా మట్టి పిసుకుతావా చెప్పరా నాన్నా?' అంటూ తనని ఒళ్ళో కూచోబెట్టుకొని కంట తడిపెట్టిన తండ్రి గుర్తుకొచ్చాడు. ఆ సంఘటన గుర్తుకొచ్చింది.

పసివాడైన తన మనసులో ఆ సంఘటన బలంగా ముద్రించుకు పోయింది. తనకు జన్మనిచ్చిన తండ్రి... తను చదువుకోవాలనీ... పెద్దపెద్ద ఉద్యోగాలు చేయాలనీ ఆశపడుతున్నాడు. తనకు జన్మనిచ్చి తల్లి, తను కన్నుతెరిచిన మరుక్షణమే, కన్ను మూసింది. అయినా తన కోసం మరో పెళ్ళి చేసుకోకుండా వున్న తండ్రి ప్రేమ గుర్తుకొచ్చింది. అందుకే అందరి పిల్లల్లా అల్లరి చేయకుండా... నానాయాగీ చేయకుండా బుద్ధిగా పలక బలపంతో తను బడికెళ్ళాడు. ఎంత బుద్ధిగా చదివాడు తను... తనని బెత్తంతో మాస్టారు ఎప్పుడూ దండించలేదు. పైగా తన తండ్రి కనిపించినప్పుడు 'మీ వాడు ఏమో అనుకున్నా... బహు బుద్ధిమంతుడు సుమా' అంటూ తండ్రితో చెబుతుంటే, తండ్రి కళ్ళలో ఆనందబాష్పాలు కనిపించేవి. ఆ సంఘటన బాగా గుర్తుంది.

అలా స్కూలు చదువు అయిపోయి, కాలేజి చదువుకు వచ్చాడు. పెంకుటిల్లు గుడిసెగా మారింది. స్కూలు చదువుకు పెంకుటిల్లు కరిగిపోయి గుడిసె అయింది. తను ఆ సంఘటన తలచుకొని ఎంత బాధపడ్డాడు. 'వద్దు నాన్నా... నేనిక ఏ ఉద్యోగమో చూసుకుంటాను' అని తండ్రి దగ్గర ఏడ్చేస్తే 'అదేంట్రా కన్నా... ఇంకా గుడిసె ఉంది. నాలుగెకరాల మాగాణి ఉంది' అన్నాడు కన్నీళ్ళతో మెరుస్తున్న కళ్ళతో.

ఇంటర్ పూర్తయింది. నాలుగెకరాల మాగాణి హారతి కర్పూరంలా కరిగిపోయింది. గుడిసె పేదరికానికి సాక్ష్యంగా మిగిలిపోయింది. 'ఇంక విశ్వవిద్యాలయ చదువులొద్దు' అని తను మొరాయిస్తే తండ్రి ససేమిరా కుదరదన్న సంఘటన గుర్తుకొచ్చింది.

తన తల మీద చెయ్యేసి 'ఒరేయ్... నువ్వు పెద్ద సదువు సదవాలి. మనూళ్ళో నీ అంత పెద్ద చదువు సదివినాడు లేడనుకోవాలి... పెద్ద ఉద్యోగం చేయాలా' అన్నాడు.

ఇంకా అమ్మడానికి ఏమున్నాయని తను అడిగితే 'నా ఒంట్లో రక్తం ఉందిరా నాన్నా...' అన్నాడు. నిజంగా తనకు ఏడుపు వచ్చింది. ఆ సంఘటన తనను కదిలించింది. తండ్రి బలమైన కోరిక అర్థమైంది. అందుకే తండ్రి బాధను చూస్తూ కూడా... తను పిజి కంప్లీట్ చేశాడు. తనకు గోల్డ్‌మెడల్ వచ్చినప్పుడు...

ఆ సంఘటన తనకు బాగా గుర్తు. తోటి విద్యార్థులు, స్కాలర్స్, ప్రొఫెసర్లు ఇంకా ఎంతోమంది మేధావులు... అందరి సమక్షంలో పుస్తకాలను ఔపోసన పట్టిన అపరబ్రహ్మలా... ఓ మేధావిలా తనని కీర్తిస్తూ, తమ విశ్వవిద్యాలయానికే మణిదీపం అంటూ పొగడ్తల నేపథ్యంలో చప్పట్ల ద్వారా హర్షధ్వానాలు వ్యక్తం చేస్తూ తనకు గోల్డ్‌మెడల్ అంద జేసినప్పుడు దూరంగా ఓ మూలకు నిలబడి కన్నీళ్ళను వరద గోదారిలా మార్చి ఆనంద బాష్పాలను ప్రవహింపజేసిన తండ్రి రూపం. ఆనాటి ఆ సంఘటన తనకి బాగా గుర్తు. చేతులు పైకెత్తి ఆశీర్వదిస్తున్నట్టు చూసిన సంఘటన హృదయంలో ఇంకా పదిలంగా ఉంది. అప్పుడే... అప్పుడే... ఓ విషాద సత్యమూ తెలిసింది. తన చదువు కోసం తండ్రి రక్తాన్నే కాదు... ఆరోగ్యాన్నీ ధారపోశాడని... క్షయవ్యాధి అతని అణువణువునా తినేస్తున్నా తన చదువుకు ఆటంకం కలగొద్దని... తన మనసులోనే దాచుకున్నాడని...

తను కంగారుపడి డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తే... డాక్టర్ అడిగిన ఫీజు కోసం తన మేధస్సుకు గుర్తుగా ఇచ్చిన గోల్డ్ మెడల్‌ని అమ్మకానికి పెట్టినప్పుడు ఇది బంగారం పూత మాత్రమే అని షాపతను చెప్పినపుడు... తను వెక్కివెక్కి ఏడ్చిన సంఘటన గుర్తుకొచ్చింది. ఇరవయ్యేళ్ళ తన తపస్సుకు మేధస్సుకు గుర్తింపుగా ఇచ్చిన ఈ గోల్డ్ మెడల్ తన తండ్రి ప్రాణాన్ని కూడా బతికించలేక పోయింది. పదివేల పాటి విలువ కూడా చేయలేకపోయిన ఈ గోల్డ్‌మెడల్... తన చదువు కోసం తన తండ్రి సర్వస్వాన్నీ బలి తీసుకుంది.

తండ్రి చ...ని... పోయాడు...

తన అసమర్థతవల్లే చనిపోయాడు.

ఇది జరిగిన తర్వాత...

ఈ పదేళ్ళలో... ఎన్ని అనుభవాలు... ఎన్ని చేదు జ్ఞాపకాలు...

